క్లుప్తంగా

చురుగ్గా రహదారి నిర్మాణం



ఆమదాలవలస వద్ద జరుగుతున్న రహదారి నిర్మాణ పనులు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వరకు అర్‌అండ్‌బీ పరిధిలో గల సీఎస్‌పీ రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు నియోజకవర్గాలను కలుపుతూ ప్రయాణికులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఈ రహదారి పనులు ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వరకు రూ.40 కోట్లతో జరుగుతున్నాయి. ఈ పనులను ఆమదాలవలస వైపు నుంచి వేగవంతంగా జరుగుతున్నట్లు ఆర్‌అండ్‌బీ జేఈ అంజనేయనాయక్ తెలిపారు. రహదారి పనులు వేగవంతంగా జరుగుతుండటంతో ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సారవకోట: మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేసి ఇటీవల బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులను స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ ఎం.వి. రమణ, పలువురు ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. లక్ష్మీనారాయణ, పి.శ్రీనివాసరావు, హిమగిరి, అసిరినాయుడు తదితరులను సన్మానించారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

పొందూరు: మండల కేంద్రంలోని చెరువు గర్భం (సర్వే నంబర్ 196)లో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. చెరువు గర్భంలో ఆక్రమణలు జరిగాయని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమంగా నిర్మించిన గోడను తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో తొలగించారు. వీఆర్వోలు రేవతిరావు, వేణుగోపాలరావు ఉన్నారు.

ఘనంగా జగన్నాథస్వామి మారు రథయాత్ర



జగన్నాథ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పొందూరు: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన జగన్నాథస్వామి మారు రథయాత్రకు భక్తులు పోటెత్తారు. గుండిచా మందిరం నుంచి జగన్నాథస్వామిని రథంలో కూర్చొండ బెట్టి మార్కెట్‌లో భక్తుల దర్శనానికి రథయాత్రను చేపట్టారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ అశోక్‌బాబు

బూర్జ: మండలంలోని కొల్లివలస జంక్షన్‌లో స్థానిక ఎస్‌ఐ బి.అశోక్‌బాబు ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు గురువారం ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు అమర్చడం వల్ల శ్రీకాకుళం నుంచి పాలకొండ ప్రధాన రహదారిలో పాలకొండ, శ్రీకాకుళం, గుత్తావల్లి వైపు వెళ్లే వాహనాలు, రాత్రి వేళల్లో జరిగే ప్రమాదాలను గుర్తించేందుకు సులభతరంగా ఉంటుందని ఎస్‌ఐ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. హెచ్‌సీ పి.రమణ, పీసీ హేమసుందరరావు పాల్గొన్నారు.

గాంధమ్మ తల్లికి చల్లదనం



గాంధమ్మ తల్లికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని జోదూరు గ్రామ దేవత గాంధమ్మ తల్లికి గ్రామస్తులు ముర్రాటలతో గురువారం చల్లదనం చేశారు. గ్రామానికి చెందిన రెంటికోట వాసునాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. పంటలుబాగా పండాలని, గ్రామాన్ని చల్లగాచూడాలని వేడుకున్నారు. ప్రతియేటా ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభించే ముందు ఇలా ప్రతీ ఇంటినుంచి ముర్రాటలు అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామపెద్దలు తెలిపారు. మహిళలందరూ అమ్మవారికి ప్రసాదాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రగతి బాటలు

- అద్దంలా ప్రధాన, గ్రామీణ రహదారులు
- నరసన్నపేట మండలంలో రూ.56 కోట్లతో రోడ్లు అభివృద్ధి



కామేశ్వరిపేట రహదారి



కోమర్తి-ఉర్లాం మధ్య నిర్మించిన రహదారి

నరసన్నపేట: గత ప్రభుత్వ కాలంలో గుంతలు పడి, కనీసం నడిచేందుకు కూడా వీలులేని దుస్థితిలో మండలంలో ఉన్న ప్రధాన రోడ్లుతోపాటు గ్రామీణ రోడ్లు గడిచిన నాలుగేళ్లుగా ఎంతో అభివృద్ధికి నోచుకున్నాయి. రోడ్లు అద్దంలా కనిపిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమంతోపాటు రోడ్లును కూడా అభివృద్ధి చేసి మండలంలోని ప్రయాణికుల పాట్లు తీర్చింది. ఒక్క నరసన్నపేట మండలంలోనే ఈ నాలుగేళ్లలో రూ.55 కోట్లుతో వివిధ రోడ్లు అభివృద్ధికి నోచుకున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని రోడ్లు రూ.45 కోట్లు అభివృద్ధి చేశారు. ఏఐఐబీ నిధులు రూ.10 కోట్లతో పీఐయూ ఇంజనీరింగ్ శాఖ పరిధిలోని పలు రోడ్లు అభివృద్ధి చెందాయి.

ఎమ్మెల్యే కృషితోనే..

ప్రయాణ కష్టాలు తీరడంతో మండలంలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోమర్తి–ఉర్లాం, కామేశ్వరిపేట, లుకలాం, బుచ్చిపేట రోడ్లుపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు ఆయా గ్రామాల ప్రజలు ఆనందంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కృషి ఫలితంగానే ఈ రోడ్లు అభివృద్ధి చెందాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో అభివృద్ధి చేపట్టిన పలు రహదారుల వివరాలు..

- కొల్లవానిపేట నుంచి కామేశ్వరిపేట మీదుగా కొబగాం వరకు–రూ. 3.40 కోట్లు.
- ఉర్లాం–లుకలాం మధ్య రూ. 2 కోట్లు.
- మడపాం బుచ్చిపేటల మధ్య రూ. కోటి.
- పల్లిపేట నుంచి నరసన్నపేట మధ్య రూ. 4.50 కోట్లు.
- కోమర్తి–బద్రి మధ్య రూ.25 కోట్లు.
- నరసన్నపేట టౌన్‌లో రోడ్డు విస్తరణ రూ.4.50కోట్లు.
- నరసన్నపేటలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా రూ.1.85 కోట్లు.
- బడ్డవానిపేట – ముప్పిడి వరకు పీఎంజీఎస్‌వై నిధులు రూ.5 కోట్లు.
- నర్సింగపల్లి రోడ్లు ఏఐఐబీ నిధులు రూ.1.12 కోట్లు.
- నారాయణవలస రోడ్డు ఏఐఐబీ నిధులు రూ.48 లక్షలు.
- గొట్టిపల్లి రోడ్డు ఏఐఐబీ నిధులు రూ. 51 లక్షలు.
- గోకయ్యవలస రోడ్డు ఏఐఐబీ నిధులు రూ.26 లక్షలు.
- కొటారపల్లి రోడ్డు ఏఐఐబీ నిధులు రూ.28 లక్షలతో అభివృద్ధి చేశారు.
- ఉప్పరిపేట రోడ్డు పనులు రూ. 2.07 కోట్లతో నిర్వహించాల్సి ఉంది.
- రావులవలస రోడ్డు పనులు రూ.1.32 కోట్లతో ప్రస్తుతం జరుగుతున్నాయి.
- పారశెల్లి–రెల్లివలసల మధ్య రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది.

అప్పట్లో భయం వేసింది



నాలుగేళ్ల క్రితం రోడ్లుపై ప్రయాణించాలంటే ఎంతో కష్టంగా ఉండేది. పది నిమిషాల ప్రయాణానికి చాలా ఇబ్బందిగా ఉండేది. ఆటో నడపలేక అవస్థలు పడేవారం. ఇప్పుడు రోడ్లు అద్దంలా ఉన్నాయి. కొన్ని నిమిషాల్లో గమ్యస్థానాలకు వెళ్లగలుగుతున్నాం.

– పాలకొండ దానయ్య, ఆటో డ్రైవర్, పాలకొండపేట

గ్రామీణ రోడ్లు బాగుపడ్డాయి



మా గ్రామానికి చెందిన రోడ్డుపై నడవడానికి కూడా చాలా అవస్థలు పడ్డాం. చుట్టాలు రావడం మానేశారు. ఎంతో అత్యవసరం అయితేనే ఊరు దాటి వెళ్లేవారం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్డు అభివృద్ధికి నోచుకుంది. చాలా ఆనందంగా ఉంది. ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– వాకముళ్ల చక్రధర్, కామేశ్వరిపేట

త్యాగానికి ప్రతీక బక్రీద్



నరసన్నపేట: జమియా మసీద్‌లో అల్లాను ప్రార్థిస్తున్న ముస్లింలు



పాతపట్నం: ప్రహరాజపాలెం మసీద్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు



మెళియాపుట్టి: పట్టుపురం మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు

త్యాగానికి ప్రతీక బక్రీద్ అని జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ బాబ్జీ, ముస్లిం మత పెద్దలు అన్నారు. గురువారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నరసన్నపేట జమియా మసీదులో, పాతపట్నం మండలంలోని ప్రహరాజపాలెం మసీదులో, మెళియాపుట్టి మండలంలోని పట్టుపురం గ్రామంలోని మసీద్‌లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అనంతరం బంధు, మిత్రులకు షీర్‌ను పంచారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్

మాదిగ మహాసభ విజయవంతం చేయాలి

ఆమదాలవలస: జులైలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల మహాసభకు ఆమదాలవలస నియోజకవర్గం నుంచి సభ్యులు హాజరై విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ పిలుపునిచ్చారు. ఆమదాలవలస పట్టణంలోని నియోజకవర్గం ముఖ్య నాయకులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌లను ఏ, బీ, సీ, డీలుగా విభజించే వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. హలో మాదిగ– చలో హైదరాబాద్ నినాదంతో అందరూ హాజరవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు బోసు మన్మథరావు, సీనియర్ నాయకుడు లోపింటి నారాయణరావు, పాస్టర్ రాడ విజయ్‌కుమార్, కంటిపాక కృపారావు, మండల అధ్యక్షుడు నవిరి ప్రసాద్, నాయకులు కుర్మాన దుర్గారావు, కుర్మాన అశోక్, పెంకి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

హిరమండలం: ఆధ్యాత్మిక చింతన ద్వారానే మానసిక ఆనందాన్ని పొందవచ్చునని, నిరంతరం దైవ నామస్మరణతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు వై.లింగరాజు అన్నారు. హిరమండలం మండల కేంద్రంలో ఉన్న ప్రేమసాయి వృద్ధాశ్రమంలో గురువారం తొలి ఏకదశి సందర్భంగా విష్ణు సహస్రనామార్చన, నామ సంకీర్తనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆశ్రమ అధ్యక్షుడు ఎ.అబ్బాయి, గోవిందశర్మ, రామారావు, అప్పలనాయుడు, చంటి, వెంకటరావు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ ఎరువులు పంపిణీకి సిద్ధం చేశామని ఏఓ పైడి లతశ్రీ చెప్పారు. యూరియా, డీఏపీ ఎరువులు విక్రయం చేపట్టామన్నారు. ఎరువులు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఎరువులు కొనుగోలు చేసుకోవాలన్నారు. మొదటి విడతగా ఒక్కొక్క రైతు భరోసా కేంద్రానికి 20 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ ఎరువు సిద్ధం చేశామన్నారు. మొదటి విడత ఎరువు విక్రయం పూర్తి చేసిన తరువాత రెండో విడతగా ఎరువులు తీసుకువస్తామన్నారు.

జగనన్న సురక్ష సర్వే పరిశీలన



సరుబుజ్జిలి: మూలసవలాపురం చేపడుతున్న జగనన్న సురక్ష సర్వే



సారవకోట: గొర్రిబందలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



పాతపట్నం: బడ్డుమర్రిలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి కరుణాకరరావు

పాతపట్నం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ ఏడీ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలోని బడ్డుమర్రి, పెద్దలొగిడి గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వేను గురువారం పరిశీలించారు. సమస్యలపై ఆరా తీశారు. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: జగనన్న సురక్ష సర్వేలు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. మండలంలోని సింధువాడ, మూలసవలాపురం, ఇస్కలపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే గురువారం పరిశీలించారు. ప్రతీ ఇంటిని సర్వే చేసి సమస్యలు గుర్తించి వెంటనే నమోదు చేయాలని సూచించారు. సింధువాడ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి జమ్మాన అలేఖ్య, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సారవకోట: జగనన్న సురక్షా సర్వేను గ్రామ వలంటీర్లు బాధ్యతతో చేపట్టాలని ఎంపీడీఓ విశ్వేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంతోపాటు గొర్రిబంద గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వేను గురువారం పరిశీలించారు. ఉదయం 6 గంటలకే ఆయన గ్రామాలకు చేరుకుని వలంటీర్లు సర్వే ఏ విధంగా చేస్తున్నారో పరిశీలించి పలు, సూచనలు సలహాలిచ్చారు. వచ్చే నెల 6 నుంచి మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ దళార్చన

నరసన్నపేట:

స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో జగన్నాథ రథయాత్ర సందర్భంగా వేంకటేశ్వర అవతారంలో ఉన్న జగన్నాథుడుకి ఆషాఢ ఏకాదశి సందర్భంగా తులసీ దళాలతో గురువారం పూజలు నిర్వహించారు. అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. నరసన్నపేట పట్టణానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.



తులసీ దళార్చనలో పాల్గొన్న మహిళలు

ప్రతి ఇంటికీ సంక్షేమం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- కొంచాడలో గడపగడపకు మన ప్రభుత్వం

పొందూరు: గ్రామాల్లోని ప్రతి ఇంటికీ సంక్షేమం అందించడమే లక్ష్యంగా, సమస్యల పరిష్కారం దిశగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొంచాడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటింటా సంతోషాన్ని నింపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడ ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాలువలు, రోడ్లు నిర్మించాలని స్పీకర్‌ను గ్రామస్తులు కోరారు. వీటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, సర్పంచ్ పెయ్యల అనూరాధ, ఎంపీటీసీ సభ్యుడు కిల్లాన సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు..

ఆమదాలవలస నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. కొంచాడలో జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ. 81 లక్షలతో ఇంటింటికీ కులాయిలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మూడు నెలల్లో పనులు పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈలకు సూచించారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిలు వీరే..



పి.విష్ణుమూర్తి, ఎల్.ఎన్.పేట · ఏవీ సురేష్, హిరమండలం · పి. జైమునిరావు, మెళియాపుట్టి · ఇ.సూర్యనారాయణ, పాతపట్నం



ఎస్. నర్సింగరావు, నరసన్నపేట · ధర్మాన జగన్, జలుమూరు · కె.సత్తిబాబు, పోలాకి · ఎస్. తులసీదాస్, సారవకోట · కె.త్రినాథరావు, కొత్తూరు



బి.నిరంజన్, ఆమదాలవలస మండలం · జి. రాంబాబు, బూర్జ · అత్తులూరి రవికాంత్, సరుబుజ్జిలి · బి.వెంకట కృష్ణారావు, పొందూరు · ఎ.ఉమామహేశ్వరరావు, ఆమదాలవలస మున్సిపాలిటీ

ఎల్.ఎన్.పేట/నరసన్నపేట/ఆమదాలవలస: పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల పరిధిలోని ఐదు మండలాలకు జేసీఎస్ ఇన్‌చార్జిలను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం నియమించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఈ నియామక ప్రక్రియ చేపట్టింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, స్పీకర్ తమ్మినేని సీతారాంకు, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతికి వీరు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఎల్.ఎన్.పేట: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ కె.రమేష్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న కాలనీ ఇళ్ల నిర్మాణం పనులు గురువారం పరిశీలించారు. కాలనీ ఇళ్ల నిర్మాణ స్థాయిల మేరకు బిల్లులు చెల్లించటం జరుగుతుందన్నారు. ఇంటి నిర్మాణ పనులు మూడు నెలల్లో పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇప్పటివరకు పనులు ప్రారంభించని వారు తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



శిక్షణ ధ్రువపత్రాలతో యువకులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయంలో గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో యువతకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ యువత సమాజ సేవ పట్ల బాధ్యతగా ఉండాలన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైపరీత్యాలు జరిగినప్పుడు స్పందించి సాయపడాలన్నారు. కాలిన గాయాలు, జంతువుల కాట్లు, ఫిట్స్, గుండెపోటు తదితర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ జీఆర్ శ్రీకాంత్ అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, బి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి



మాట్లాడుతున్న స్టేట్ వైస్ చైర్మన్ రమణమూర్తి

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో గల ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఏకలవ్యుడి జయంతిని గురువారం ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ ఏపీ స్టేట్ వైస్ చైర్మన్ గేదెల రమణమూర్తి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఏకలవ్య చిత్రపటానికి రమణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. తెంబూరు బాబూరావు, నారాయణరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.